క్లుప్తంగా

రైతుబజార్ల సెలవు కొనసాగించాలి

సీతమ్మధార: విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిధిలోని సీతమ్మధార, నరసింహనగర్ రైతు బజార్లకు యథావిధిగా సెలవు కొనసాగించాలని రెండు రైతుబజార్లకు చెందిన రైతులు కోరారు. ఈ మేరకు వారు ఎమ్మెల్యే పి.విష్ణు కుమార్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సీతమ్మధార బజారుకు ప్రతి మంగళవారం, నరసింహనగర్ బజారుకు ప్రతి బుధవారం సెలవు ఉండేదన్నారు. గతంలో రాష్ట్రంలోని అన్ని రైతుబజార్లకు వారంలో ఒక రోజు సెలవు ప్రకటించారని గుర్తు చేశారు. మెజారిటీ రైతులు, డ్వాక్రా సంఘాలు, ఇతర వ్యాపారులు సెలవు కోరుకుంటున్నారని గుర్తు చేశారు. అలాగే రైతుబజార్లలో పెరిగిన అద్దెలను తగ్గించాలని కోరారు. సెలవు కొనసాగించాలని కోరుతూ జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, మార్కెటింగ్‌శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ యాసిన్‌లకు కూడా వినతి పత్రాలు అందజేస్తున్నామని వారు తెలిపారు.

యువతి అదృశ్యం


అఖిల (ఫైల్)


మద్రిపాలెం: కంచరపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఊర్వశి జంక్షన్ దారి సుభాష్ నగర్‌లో అఖిల తల్లితండ్రులతో కలిసి నివసిస్తుంది. ఆమె ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఓ జ్యూస్ షాప్‌లో ఆరు నెలలుగా పనిచేస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 11న పనికి వెళ్లిన యువతి రాత్రి 9 గంటలైనా ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని కోరారు.

కొండవాలు ప్రాంతాల్లో కార్పొరేటర్ పర్యటన


ప్రమాదభరితంగా ఉన్న డ్రైనేజీని పరిశీలిస్తున్న ఇంజినీరింగ్ సిబ్బంది

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం పరిధి ఇందిరానగర్‌లో డ్రైనేజీలు, కాలువలు, మెట్లమార్గాలు శిధిలావస్థకు చేరుకున్నాయని ఆయా కాలనీవాసులు వార్డు కార్పొరేటర్ గంకల కవితకు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కార్పొరేటర్ కవిత పర్యవేక్షణలో శనివారం జోన్–5 ఇంజినీరింగ్ సిబ్బంది, వార్డు నాయకులు గంకల అప్పారావు వార్డులో పర్యటించారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొండవాలు ప్రాంతాల్లో సమస్యలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయని తెలిపారు. వీటి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

ముమ్మరంగా బీజేపీ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదును పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా జరుగుతోందని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు వెల్లడించారు. ఈ మేరకు బాలయ్యశాస్త్రి లేఅవుట్ వద్ద గల బీజేపీ కార్యాలయంలో సభ్యత్వ నమోదులో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచంలోనే అతిపెద్ద సభ్యత్వం పార్టీ బీజేపీ అని గుర్తు చేశారు. ప్రజలు, పార్టీ శ్రేణులు విధిగా పార్టీ సభ్యులుగా నమోదు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి సురేష్‌బాబు, బీజేపీ నాయకురాలు శ్యామలా దీపిక, సునీల్, పార్టీ 14 వార్డు అధ్యక్షుడు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.


శ్మశానంలో నిర్మాణం జరుగుతున్న వెయింటింగ్ హాళ్లు


నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లు


నిర్మాణంలో శివాలయం

శ్మశాన వాటికకు కొత్త రూపు

రూ.1.90 కోట్లతో నక్కవానిపాలెం శ్మశాన వాటిక అభివృద్ధి


శ్మశానంలో నిర్మాణంలో ఉన్న దహన వాటిక


నిర్మాణంలో ఉన్న ప్లాట్‌ఫారాలు

సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 23,24 వార్డులలో విస్తరించి ఉన్న నక్కవానిపాలెం శ్మశాన వాటికలో రూ.1.90 కోట్లతో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జీవీఎంసీ కేటాయించిన నిధులతో సౌకర్యాలు కల్పిస్తున్నారు. నూతనంగా రెండు దహన వాటికల నిమిత్తం ప్లాట్‌పారాలు నిర్మిస్తున్నారు. రెండు వెయింటింగ్ హాల్స్, కార్యాలయ గది, కాటికాపరి భవనం, శివాలయం నిర్మిస్తున్నారు. నూతనంగా టాయిలెట్స్ నిర్మాణం జరుగుతోంది. వాచ్‌మన్ రూంకు మరమ్మతులు నిర్వహిస్తున్నారు. నక్కవానిపాలెం, రేసపువానిపాలెం, గాంధీ నగర్, క్రాంతినగర్, మద్దిలపాలెం, టీపీటీ కాలనీ, కేఆర్‌ఎం కాలనీ, పీఅండ్‌టీ కాలనీ, సీతమ్మధార, ఎంఎంటీసీ కాలనీ, ఏఎస్‌ఆర్‌నగర్, బిలాల్ కాలనీ, నార్‌ఎక్స్‌టెన్షన్, తులసీపేట, న్యూ రేసపువానిపాలెం, బాలయ్యశాస్త్రిలేఅవుట్, హెచ్‌బీకాలనీ తదితర ప్రాంతాల్లో పార్థివదేహాలకు దహన సంస్కారాలు ఇక్కడే నిర్వహిస్తారు.

ఇబ్బందులు ఇవే...

గత కొద్ది కాలంగా శ్మశానంలో సమస్యలు రాజ్యమేలాయి. చెత్తాచెదరాలతో దుర్వాసన వెదజల్లేది. రాత్రి సమయాల్లో యువకులు మద్యం సేవించేవారు. పిచ్చిమొక్కలు దట్టంగా పెరగడంతో దహన సంస్కారాల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బందులుపడేవారు. వాస్తవానికి మొత్తం ఎనిమిది ప్లాట్‌ఫారాలు ఉండాల్సి..నాలుగు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. లాకర్లు లేక అస్థికలు భద్రపరచడం ఇబ్బందిగా ఉండేది. ప్రస్తుతంలో వీటిలో కొన్ని సమస్యలు పరిష్కరించారు. రూ.1.90 కోట్లతో శ్మశానంలో అభివృద్ధి పనులు పూర్తయితే ప్రజలకు ఉపశమనం ఏర్పడనుంది. ప్రస్తుతం శ్మశానంలో నాలుగు ఫ్లాట్‌ఫారాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. వాస్తవానికి ఇక్కడ ఎనిమిది ప్లాట్‌ఫారాలు అవసరం. దీంతో ఒకేరోజు అధిక సంఖ్య లో మృతదేహాలు వస్తే దహన సంస్కారాలకు ఇబ్బందిగా మారుతోంది.

నాలుగు ఫ్లాట్‌ఫారాలే ఉన్నాయి



దహన వాటికలు గతంలో ఎనిమిది ఉండేవి. ప్రస్తుతం నాలుగు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. తాను వారసత్వంగా 2008 నుంచి ఇక్కడ కాటికాపరిగా పనిచేస్తున్నా. గతంలో తండ్రి గంగాధర్, బాబాయ్ నాగరాజు కాటికాపర్లుగా పనిచేసేవారు. రోజుకు సగటున రెండు దహనాలు జరుగుతాయి. నెలకు 30 వరకు దహనాలు జరుగుతాయి. ఇక్కడ దహనాల కోసం వచ్చేవారు 9701729164 నంబర్‌లో సంప్రదిస్తే శ్మశాన వాటికలో అందుబాటులో ఉంటాను.

– రామారావు, కేర్‌టేకర్, శ్మశాన వాటిక, నక్కవానిపాలెం.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


విద్యార్థులతో గండి బాబ్జి, వెలమ సంఘం నాయకులు

మురళీనగర్: మురళీనగర్ మాధవదార వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వర్మ కాంప్లెక్సు సమీపంలోని శనివారం రాత్రి నిర్వహించిన వెలమ సామాజిక వర్గం సమావేశంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాశల సూర్యనారాయణ, వెన్నెల సూర్యనారాయణల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నగర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇంటర్, పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన 20 మంది విద్యార్థులకు ఒక్కొక్కరి రూ.5 వేలు చొప్పులే పంపిణీ చేశారు. జ్ఞాపిక, సర్టిఫికెట్లను అందించారు. వెలమ సామాజిక వర్గం సంక్షేమానికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని గండి బాబ్జీ అన్నారు. కార్యక్రమంలో 49వార్డు కార్పొరేటరు అల్లు శంకరరావు, సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాశల సూర్యనారాయణ, వెన్నెల సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఎల్.జానకీరామ్, కోశాధికారి పి.సన్యాశిరావు, సంయుక్త కార్యదర్శి దరిమిరెడ్డి దేముడు, సెంట్రల్ ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షుడు శిరికి పోతురాజు, కెమికల్ ఇంజినీరింగు కాలేజీ పూర్వ ప్రిన్సిపాల్ బోకం దేముడు తదితరులు పాల్గొన్నారు.

'ఆదిత్య గణపతి'గా దుర్గాగణపతి


'ఆదిత్య గణపతి' అలంకారంలో దుర్గాగణపతి

సీతంపేట: వినాయక నవరాత్రి మహోత్సవాలలో భాగంగా సీతంపేటలో కొలువైన దుర్గా గణపతి 8వ రోజు శనివారం సాయంత్రం 'ఆదిత్య గణపతి' అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో గణపతి హోమం, స్వామి వారికి పంచామృత అభిషేకం, చందన, విభూది, ఫల రసాలతో విశేష అభిషేకం, సహస్ర నామార్చన, ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమం అలరించాయి. నవరాత్రి ఉత్సవాలలో చివరి రోజైన ఆదివారం 'అర్ధనారీశ్వర గణపతి' అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపిల్లి గోవింద్ తెలిపారు.

పేద విద్యార్థులకు ప్రోత్సాహకాలు


నగదు పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో బ్యాంకు డైరెక్టర్ బొల్లిన ప్రభాకర్

సీతంపేట: ది సిటిజన్ కో ఆపరేటివ్ బ్యాంకు సీతమ్మధార శాఖ ఆధ్వర్యంలో టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ చూపిన పేద విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేశారు. సీతంపేటలో శనివారం జరిగిన కార్యక్రమంలో కో ఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ బొల్లిన ప్రభాకర్ చేతులమీదుగా పది మంది విద్యార్థులకు ఒక్కక్కరికి రూ.10వేలు చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బ్యాంకు 6 రాష్ట్రాల్లో 42 శాఖల ద్వారా నాలుగు వేల కోట్లకు పైగా వ్యాపారం చేస్తూ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఎస్.ఎస్.నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఉన్న స్తంభాల మార్పు

సాక్షి ఎఫెక్ట్..


స్తంభాలను మార్చుతున్న విద్యుత్ శాఖ సిబ్బంది

తాటిచెట్లపాలెం: కొండవాలులో ఒరిగిన స్తంభాలు శీర్షికన సాక్షి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన వార్తకు విద్యుత్ శాఖ సిబ్బంది స్పందించారు. జీవీఎంసీ 45వ వార్డు పరిధి కొండవాలు ప్రాంతాలైన వరాహగిరికాలనీలో సుమారు రెండు దశాబ్దాల క్రితం వేసిన విద్యుత్ స్తంభాలు ప్రమాదకర స్థితికి చేరాయి. 'సాక్షి'లో వచ్చిన వార్తకు విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించి కొత్త స్తంభాలు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. శనివారం పనులను ప్రారంభించి ప్రమాదకరంగా ఉన్న రెండు స్తంభాలను మార్చారు. ఆదివారం కూడా పనులు చేపట్టనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పేద బాలలకు సాయంత్రం ట్యూషన్

మద్దిలపాలెం: మురికివాడల్లోని బడి ఈడు పిల్లల కోసం సాయంత్రం ట్యూషన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చదువు మధ్యలో ఆపేసిన పేద బాలలకు విద్యను అందించే ఉద్దేశంతో ఉచిత ట్యూషన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. బీచ్ రోడ్డులోని ఫిషింగ్ హార్బర్ వద్ద గల సఫనెట్ హాస్టల్ పక్కన ప్రతి రోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. సోమవారం నుంచి క్లాసులు ప్రారంభమవుతాయని ఆయన చెప్పారు.

ఏయూ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా యుగంధర్

ఎంవీపీకాలనీ: ఆంధ్రా యూనివర్సిటీ స్టాఫ్ కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా డాక్టర్ ఎన్.ఎం.యుగంధర్ నియమితుడయ్యారు. రొటేషన్‌లో భాగంగా శనివారం సొసైటీ కార్యాలయంలో కార్యవర్గ సభ్యులు తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు యుగంధర్ తెలిపారు. అధ్యక్షుడితోపాటు ఇతర పాలకవర్గ నాయకులను ఎన్నుకున్నారన్నారు. సొసైటీ ఉపాధ్యక్షుడిగా డొక్కర శ్రీనివాస్, కార్యదర్శిగా సిహెచ్.లక్ష్మణబాబు, కోశాధికారిగా డాక్టర్ ఎ.పల్లవి, అదనపు కార్యదర్శిగా కిలాన కిరణ్ నియమితులైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా పాలక వర్గ సభ్యులను పలువురు అభినందించారు.

ఘనంగా నవగ్రహ పూజలు

సీతమ్మధార : నవగ్రహ పూజలు ఘనంగా జరిగాయి. ఈ మేరకు సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీ మహాగణపతి ప్రసన్న వేంకటేశ్వర, అయ్యప్ప, శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో శనివారం శని దోష నివారణ పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాలలో గల భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది శివ, వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ సంప్రదాయసిద్ధంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయం అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 300మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం నక్షత్ర హారతి, కర్పూర హారతి, కూష్మాండ హారతి, కుంభ హారతి సమర్పించినట్టు ఆలయ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు.

ఏచూరి పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం

సీతంపేట: కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం కమ్యూనిజానికి, పేద ప్రజలకు తీరని లోటని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి పేర్కొన్నారు. సీతారాం ఆశయాలను, పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకువెళ్తామని తెలిపారు. పేద ప్రజల, కార్మిక వర్గం దోపిడీ శక్తులకు వ్యతిరేకంగా , శ్రమజీవుల హక్కుల సాధనకు పోరాటాలు చెయ్యడమే ఏచూరి మృతికి నిజమైన నివాళులు అన్నారు.

తప్పించుకు తిరుగుతున్న నిందితుడి అరెస్టు


నిందితుడితో రైల్వేపోలీసులు

తాటిచెట్లపాలెం: గంజాయి కేసులో తప్పించుకుతిరుగుతున్న నిందితుడ్ని శనివారం గవర్నమెంట్ రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. ఆర్పీఎఫ్ ఎస్ఐ రవివర్మ తన సిబ్బందితో కలిసి శనివారం వివిధ ప్లాట్‌ఫారాలపై తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో గంజాయి కేసులో నిందితుడైన అల్లూరి జిల్లాకు చెందిన సదేరి సత్తిబాబును అరెస్టు చేశారు. గంజాయి రవాణా చేసేందుకు రెక్కీ నిర్వహిస్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. తదుపరి విచారణ నిమిత్తం జీఆర్పీ పోలీసులకు నిందితుడ్ని అప్పగించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


ఉరివేసుకుని మృతి చెందిన యువకుడు

మద్రిపాలెం: జ్ఞానాపురం రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాలు... రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన గుర్తు తెలియని సుమారు 25 ఏళ్ల వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతుడు బిస్కెట్ కలర్ కాటన్ జీన్ ఫ్యాంట్, పసుపు, తెలుపు నలుపు రంగు గల టీ షర్టు ధరించి ఉన్నాడు. వివరాలు తెలిసిన వారు కంచరపాలెం పోలీసులకు తెలియజేయాలని కోరారు.

కృష్ణా కళాశాలలో ఫస్ట్ ఎయిడ్ డే

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్. కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు అధ్యక్షతన, యూత్ రెడ్‌క్రాస్, రెడ్ రిబ్బన్ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ ప్రథమ చికిత్స దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి జిల్లా రెడ్‌క్రాస్ సెక్రటరీ రవికుమార్, ప్రథమ చికిత్స నిపుణుడు డాక్టర్ రహమతుల్లా ప్రథమ చికిత్స విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు, అత్యవసర పరిస్థితుల్లో గుండెపోటుకు గురైన వారికి చేయాల్సిన సీపీఆర్ విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, రెడ్‌క్రాస్, రెడ్ రిబ్బన్ కో ఆర్డినేటర్లు రామకృష్ణ, సాయికృష్ణ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావు, డాక్టర్ శామ్యూల్ డేవిడ్‌రాజ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై రైతులు అవగాహన పెంచుకోవాలి


లీగల్ ఎయిడ్ క్లినిక్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సత్యనారాయణ, ఈవో కృష్ణమోహన్

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు కంచరపాలెం పరిధి దేవేంద్రనగర్‌లో గల కంచరపాలెం రైతు బజారులో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం 'వ్యాపార వ్యవహారాల'పై రైతులకు, వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించా రు. ముఖ్యఅతిథిగా ఎఫ్‌ఈడీసీవో చైర్మన్ మద్రి సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. నేటి వ్యాపార సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. రైతు పంట పండించే వ్యాపారే కాదు వినియోగదారుడు కూడా అని తెలిపారు. రైతులను గౌరవించే బాధ్యత ప్రతి వినియోగదారునిపై ఉందన్నారు. రైతుబజారులో లీగల్ ఎయిడ్ క్లినిక్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. లీగల్ ఎయిడ్ క్లినిక్‌లో రైతులు, వినియోగదారుల కోసం ఫిర్యాదు బాక్స్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రైతు బజారు ఈవో కృష్ణమోహన్, అటెండర్ దిలీప్, లీగల్ కమిటీ సభ్యులు, రైతులు, డ్వాక్రా సభ్యులు, వినియోగదారులు, తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపాల వద్ద అన్న సమారాధన


భక్తులకు ఆహార పదార్థాలు వడ్డిస్తున్న అతిథులు


అన్నదానం చేస్తున్న డాక్టర్ రమణమూర్తి


సాక్షి మహాగణపతి ఆలయం వద్ద జరిగిన అన్నదానంలో పాల్గొన్న వంశీకృష్ణ శ్రీనివాస్

సీతంపేట: వినాయక నవరాత్రి మహోత్సవాలలో భాగంగా సీతంపేట హరిజన వీధిలో శనివారం మధ్యాహ్నం మహా అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పి.సత్యనారాయణ, భీమవరపు శ్రీనివాసరావు, పెద్దాడ హేమంత్, జీవీవీఎస్ కమలాకర్ రావు, భోగవిల్లి గోవింద్ పాల్గొని భక్తులకు వడ్డన చేశారు. సుమారు వెయ్యి మందికి అన్న ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పెద్దాడ వాసు, రాయుడు కనకరాజు, కొసనావెంకటరెడ్డి, వినయ్, బబ్లు, అఖిల్, చిన్ని, నాగేంద్ర, కనకరాజు పాల్గొన్నారు.

14వ వార్డులో..

సీతమ్మధార: జీవీఎంసీ పరిధి 14వ వార్డు జాతీయ రహదారిలో శ్రీ భవాని యూత్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ పైడి కళా వెంకట రమణమూర్తి ప్రారంభించారు. ఆయన కుటుంబ సమేతంగా వినాయకుడికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త ఎన్.వెంకటరెడ్డి, ఎస్.మురళీ ఇశాంత్‌రెడ్డి, గోదావరి రెడ్డి కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరిరెడ్డి, తెలంగాణ వ్యాపారవేత్త ధర్మపాలరెడ్డి, శ్రీ భవాని యూత్‌ఫ్రెండ్స్ సభ్యులు కే.శివ, పి.మాధవ్, టీ.అప్పారావు, నూకరాజు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

తాటిచెట్లపాలెంలో..

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెంలోని సాక్షి మహాగణపతి ఆలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం భారీ అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆదర్శం కావాలి


ఆచార్య రామకృష్ణారావును సత్కరిస్తున్న కళాశాల అధ్యాపకులు

సీతంపేట: భారతరత్న సర్ మోక్ష గుండం విశ్వేశ్వరయ్యను నేటి యువ ఇంజనీర్లు ఆదర్శంగా తీసుకోవాలని కృష్ణా యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య ఎస్.రామకృష్ణారావు అన్నారు. స్థానిక బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాలలో 57వ ఇంజనీర్స్ డే వేడుకల్లో భాగంగా శనివారం ఇంజినీరింగ్ సొల్యూషన్స్ ఫర్ ఏ సస్టైనబుల్ వరల్డ్ అంశంపై ఆయన ప్రసంగించారు. విశ్వేశ్వరయ్య బ్రిటిష్ ఇండియా ప్రభుత్వానికి సివిల్ ఇంజనీర్‌గా పనిచేశారని తెలిపారు. కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి జి.టి.నాయుడు మాట్లాడుతూ పర్యావరణ సమస్యలు పరిష్కరించడానికి సివిల్ ఇంజినీరింగ్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ దీపక్ చౌదరి మాట్లాడుతూ ప్రపంచంలో రష్యా తర్వాత భారతదేశంలో ఎక్కువ మంది ఇంజనీర్లు ఉన్నారన్నారు. కార్యక్రమంలో సివిల్ ఇంజినీరింగ్ అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.